సాక్షి ఖమ్మం
శనివారం । 28 । జనవరి । 2023



ముగిసిన జయంతోత్సవాలు
మూడు రోజులుగా నేలకొండపల్లిలో జరుగుతున్న భక్త రామదాసు జయంతోత్సవాలు ముగిశాయి. 8లో



అన్నదాత.. అరిగోస!
అప్రకటిత విద్యుత్ కోతలకు తోడు త్రీ ఫేస్ విద్యుత్ సరఫరాలో లోపాలతో రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
34°/ 19°

వాతావరణం
జిల్లాలో ఉదయం మంచు, సాయంత్రం చలి ప్రభావం ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి.

న్యూస్‌రీల్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎంపీ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం, మధిర, వైరా నియోజకవర్గాలకు చెందిన 18 మంది లబ్ధిదారులకు బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఖమ్మంలోని నివాసంలో ఆయన 18 మందికి రూ.15.31 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, సర్పంచ్ బాలాజీతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు చావా రామకృష్ణ, రామకృష్ణారెడ్డి, బాణాల వెంకటేశ్వరరావు, పోట్ల శ్రీనివాసరావు, సతీష్, ఎల్లంకి సత్యనారాయణ, చిత్తారు సింహాద్రి యాదవ్, మోరంపూడి ప్రసాద్, కనకమేడల సత్యనారాయణ, చిరంజీవి, చెరుకుమల్లి రవి, చీకటి రాంబాబు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతమైన న్యాయ సేవలు అందించండి

- జిల్లా జడ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీనివాసరావు

ఖమ్మంలీగల్: న్యాయ సహాయ న్యాయవాదులు సమర్థవంతమైన న్యాయసేవలను అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు సూచించారు. న్యాయ సహాయ న్యాయవాదులు, జైలు న్యాయ సహాయ న్యాయవాదులతో శుక్రవారం ఆయన సమావేశమై మాట్లాడారు. కారాగారం లేదా ఇతర వ్యవస్థల్లో కస్టడీలో ఉన్న అందరూ ఉచిత న్యాయసాయానికి అర్హులని తెలిపారు. ఈ విషయంలో న్యాయవాదులు సమన్వయంతో వ్యవహరిస్తూ విచారణ ముద్దాయిలకు సత్వర న్యాయం అందేలా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో న్యాయ సేవా సంస్థ కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

కోచ్‌ల నియామకానికి దరఖాస్తులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో బాస్కెట్‌బాల్, వైరాలోని ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ కోచ్‌ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి తెలిపారు. ఏడాది ఎన్ఐఎస్ డిప్లొమా కోర్సు పూర్తిచేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 30వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

46,566 మందికి కంటి పరీక్షలు



కళ్లద్దాల బాక్స్‌లు దింపుతున్న ఉద్యోగులు, 104 డ్రైవర్లు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమం చురుగ్గా కొనసాగుతోంది. ఈమేరకు శుక్రవారం నాటికి జిల్లా వ్యాప్తంగా 46,566 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో 13,859 మందికి రీడింగ్ గ్లాసులు అవసరముండగా 13,832 మందికి అందజేశామని తెలిపారు. అలాగే 8,778 మందికి ప్రిస్కిప్షన్ గ్లాసులు అవసరమని గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు.

జిల్లాకు కంటి అద్దాలు
కంటి వెలుగు శిబిరాల్లో పరీక్షలు చేశాక అవసరమైన రీడింగ్ గ్లాసులను అక్కడికక్కడే అందజేస్తున్నారు. ఇందుకోసం తొలిదఫాగా 59,160 కంటి అద్దాలు జిల్లాకు రాగా, రెండో విడతలో 55 వేల కళ్లద్దాలు శుక్రవారం వచ్చాయి. వీటిని పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని స్టోర్ రూంలో భద్రపరిచారు. కాగా, వాహనాల్లో వచ్చిన కంటి అద్దా బాక్స్‌లను దించేందుకు కార్మికులు లేకపోవటంతో ఉద్యోగులు, 104 డ్రైవర్లతో దింపించడం కనిపించింది.

సీనియారిటీ తేలింది



- ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ షురూ
- జిల్లాలో ఖాళీల వివరాలు వెల్లడి
- పదోన్నతుల అర్హుల జాబితా విడుదల
- నేటి నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఏళ్ల తర్వాత ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించడమే కాక బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యాన ఉపాధ్యాయ వర్గాల్లో ఆనందంగా వ్యక్తమవుతోంది. కాగా, శుక్రవారం బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితాను అధికారులు విడుదల చేశారు. ఇక శనివారం నుంచి దరఖాస్తులు స్వీకరించనుండడంతో ప్రక్రియ చురుగ్గా సాగనుంది.

షెడ్యూల్ ఇలా...
ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. అర్హులైన ఉపాధ్యాయులు శనివారం నుంచి 29వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, ఈనెల 31నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఆన్‌లైన్ కాపీలకు సర్టిఫికెట్లు జత చేసి ఎంఈఓ, డీఈఓలకు అందచేయాలి. ఫిబ్రవరి 3నుంచి 8వ తేదీ వరకు దరఖాస్తులు పరిశీలన చేయనుండగా, 7, 8వ తేదీల్లో అభ్యంతరాలను పరిశీలించనున్నారు. ఇక 11, 12వ తేదీల్లో మార్గదర్శకాలకు అనుగుణంగా బదిలీలు, పదోన్నతుల జాబితా వెల్లడిస్తారు. ఆ తర్వాత 19నుంచి 20 తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది.

బదిలీలకు అర్హులు వీరే
ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు ఇలా అన్ని రకాల కేడర్ల ఉపాధ్యాయులు బదిలీలకు అర్హులే. 2022 ఫిబ్రవరి 1నాటికి ఒకే చోట ఐదేళ్ల సర్వీస్ పూర్తయిన ప్రధానోపాధ్యాయులు, మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే, ఉద్యోగ విరమణకు మూడేళ్ల కాలం మిగిలి ఉన్న వారికి మినహాయింపు ఇవ్వనున్నారు. కాగా, తప్పనిసరిగా బదిలీకి అవకాశం కలిగి ఉండి, వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోని ఉపాధ్యాయులను మిగిలిపోయిన ఖాళీల్లో బదిలీ చేస్తారు.

కటాఫ్ తేదీలు
పదోన్నతుల కోసం కేటగిరీల వారీగా కటాఫ్ తేదీలను ప్రకటించారు. ఉపాధ్యాయుల వారీగా అన్ని కేటగిరీలకు కటాఫ్ తేదీలు ప్రకటించారు. ఆయా తేదీలు, డీఎస్సీల వారీగా ఉపాధ్యాయులను పదోన్నతికి అర్హులుగా గుర్తించనున్నారు.

జిల్లాలో కేడర్ల వారీగా ఖాళీలు

గ్రేడ్-2 హెచ్‌ఎం	79
స్కూల్ అసిస్టెంట్స్ మ్యాథ్స్	44
ఫిజికల్ సైన్స్	09
బయాలజీ	89
సోషల్ స్టడీస్	142
తెలుగు	36
హిందీ	20
ఇంగ్లిష్	27
ఫిజికల్ డైరెక్టర్	05
ఎల్‌ఎఫ్‌ఎల్	77

పారదర్శకంగా పూర్తిచేయండి

ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా పూర్తిచేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి శుక్రవారం ఆమె విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, డైరెక్టర్ దేవసేనతో కలిసి కలెక్టర్లు, అధికారులతో వీసీ ద్వారా సమీక్షించారు. టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని సూచించారు. జాబితాలు ప్రదర్శించడమే కాక అభ్యంతరాలు స్వీకరించాలని, తాత్కాలికంగా మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇక మన ఊరు – మన బడిలో అన్ని పనులు పూర్తయ్యాకే ప్రారంభించాలని, ప్రతీ మండలంలో ఎంపిక చేసిన మోడల్ పాఠశాలను ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. ఈ వీసీలో జిల్లా నుంచి కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ మన ఊరు – మన బడి ద్వారా ఎంపిక చేసిన 62 పాఠశాలలకు గాను 33 పాఠశాలల్లో అన్ని పనులు పూర్తిచేశామని తెలిపారు. వీసీలో అదనపు కలెక్టర్ స్నేహలత, డీఈఓ సోమశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం



ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. సీనియారిటీ జాబితా ఆధారంగా పదోన్నతులు, బదిలీలు చేపడతాం. ఈ విషయంలో ఉపాధ్యాయులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
– సోమశేఖర శర్మ, డీఈఓ

విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట



పాతర్లపాడులో జెడ్పీ హెచ్‌ఎస్ భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన ఎంపీ నాగేశ్వరరావు, కలెక్టర్ గౌతమ్, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ తదితరులు

- రాష్ట్ర మంత్రి పువ్వాడ, ఎంపీ నామా నాగేశ్వరరావు
- పాతర్లపాడులో పాఠశాల భవనం ప్రారంభం
- దళితబంధు యూనిట్ల పంపిణీ



దళితబంధు యూనిట్లు అందజేస్తున్న మంత్రి, ఎంపీ

చింతకాని: రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు వెల్లడించారు. మండలంలోని పాతర్లపాడులో ఎంపీ, ఇతర నిధులు రూ.34 లక్షల వ్యయంతో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాలను శుక్రవారం మంత్రి, ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించారని తెలిపారు. మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తుండగా, తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలని కోరారు.

త్వరలోనే చింతకానికి సీఎం
రాష్ట్రంలో అమలుచేస్తున్న దళితబంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి పువ్వాడ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా చింతకాని మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేయటంతో జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వందశాతం యూనిట్లను గ్రౌండింగ్ చేశారని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా జరిగిన లబ్ధిని పరిశీలించేందుకు సీఎం కేసీఆర్ త్వరలోనే మండలానికి వచ్చి దళితులతో కలిసి భోజనం కూడా చేస్తారని తెలిపారు. దళితబంధు యూనిట్లను సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా ఆర్థికాభివృద్ధిని సాధించాలని సూచించారు. అనంతరం గ్రామంలో దళితబంధు లబ్ధిదారులకు మంత్రి పువ్వాడ, ఎంపీ నాగేశ్వరరావు కార్లు, ట్రాక్టర్లు, ట్రక్కులను అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన కొత్తపల్లి రంగయ్య జ్ఞాపకార్థం కొత్తపల్లి సైదుబాబు, జాన్‌బాబు, శివ పాఠశాలలో ఫర్నీచర్ కోసం రూ.30 వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, జెడ్పీ, డీసీసీబీ చైర్మన్లు కొండబాల కోటేశ్వరరావు, లింగాల కమల్‌రాజ్, కూరాకుల నాగభూషణం, అదనపు కలెక్టర్ స్నేహలత, డీఈఓ సోమశేఖరశర్మ, సర్పంచ్ కాంద్ర పిచ్చయ్య, జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ మంగీలాల్, ఎంఈఓ మోదుగు శ్యాంసన్, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్‌తో పాటు తేలుకుంట్ల శ్రీనివాసరావు, బొర్రా ప్రసాద్‌రావు, నల్లమోతు శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

వీసీలో కలెక్టర్ గౌతమ్



వందనంలో డెయిరీ యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్: ధరణి పోర్టల్ ద్వారా అందిన దరఖాస్తులను గడువులోగా పరిష్కారానికి తహసీల్దార్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం తహసీల్దార్లతో భూసంబంధ సమస్యలపై వీసీ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణికి సంబంధించి, బల్క్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్, డీఆర్వో శిరీష, ఆర్డీవో రవీంద్రనాథ్, సూపరింటెండెంట్లు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిర్వహణ ఇక్కడ నుంచే...
సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచే అన్ని కార్యాలయాల నిర్వహణ ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సముదాయంలోని పలు విభాగాలను పరిశీలించిన కలెక్టర్ సూచనలు చేశారు.

దళితబంధుతో ఆర్థికాభివృద్ధి
చింతకాని: దళితబంధు యూనిట్లను సక్రమంగా వినియోగించుకుంటూ లబ్ధిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. చింతకాని మండలం వందనంలో యూనిట్లను కలెక్టర్ తనిఖీ చేశారు. గతంలో ఏం చేసేవారు, ఇప్పుడు యూనిట్లతో వస్తున్న ఆదాయం వివరాలు తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ స్నేహలత, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, పశుసంవర్థక శాఖ అధికారి వేణుమనోహర్, ఆర్‌టీఓ కిషన్‌రావు, సర్పంచ్ కె.సునీత, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ మంగీలాల్, ఎంపీఓ రవీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పరిశీలించిన సీఈ



పంప్ హౌస్‌లో పరిశీలిస్తున్న సీఈ శంకర్‌నాయక్

కల్లూరు రూరల్: మండలంలోని కొర్లగూడెం వద్ద పటమట వాగుపై నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులను జలవనరుల శాఖ సీఈ జి.శంకర్‌నాయక్ శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లిఫ్ట్ ఇరిగేషన్‌కు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం అవసరం ఉండగా, రూ.26లక్షల నిధులతో అంచనాలు రూపొందించామని తెలిపారు. ఈఈ లక్ష్మీనారాయణ, డీఈఈ జె.రత్నాకర్, ఏఈ ప్రసాద్‌తో పాటు సిబ్బంది వెంకటేశ్వర్లు, రాంబాబు, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంతో 'సత్యభామ'కు అనుబంధం

జిల్లాకు పలుమార్లు వచ్చిన జమున



ఖమ్మంగాంధీచౌక్: విభిన్న భాషల్లో కథానాయికగా నటించడమే కాక సత్యభామ పాత్రలో అందరినీ మెప్పించిన జూలూరి జమున శుక్రవారం కన్నుమూసినట్లు తెలియడంతో జిల్లా అభిమానుల్లో విషాదం అలుముకుంది. వివిధ చిత్రాల షూటింగ్ కోసమే కాక రాజకీయంగా కూడా ఆమె ఖమ్మం జిల్లాలో పర్యటించారు. 1978లో తుఫాను బీభత్సం సృష్టించగా.. సినీ దిగ్గజాలు ఎన్‌టీ.రామారావు, అక్కినేని నాగేశ్వరరావు తదితరులతో కలిసి జమున ఖమ్మంకు వచ్చి విరాళాలు సేకరించారు. ఖమ్మం త్రీటౌన్ గుట్టల బజార్‌లోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో బస చేసి విరాళాలను సేకరించినట్లు స్థానికులు వెల్లడించారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో కొనసాగినప్పుడు అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ వెంట ఎన్నికల ప్రచారం కోసం కూడా ఖమ్మం వచ్చినట్లు చెబుతున్నారు. అంతేకాక ఉమ్మడి జిల్లాలోని భద్రాచలం, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో జమున నటించిన అనేక సినిమాల చిత్రీకరణ జరిగిందని ఆమెను కలిసి అభిమానులు వెల్లడించారు.

గంగారంలో కేంద్రబృందం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం గంగారం గ్రామాన్ని జాతీయ స్థాయి బృందం శుక్రవారం సందర్శించింది. ఈ మేరకు నాగరాజు, రెహమాన్‌తో కూడిన బృందం గ్రామంలో చేపట్టిన పనులు, జీవనోపాధులను పరిశీలించారు. అలాగే, ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డులు, ఫించన్ వివరాలు ఆరా తీసి రికార్డులు తనిఖీ చేశారు. సర్పంచ్ మందపాటి శ్రీనివాసరెడ్డి, ఏపీడీ వెంకటపతిరాజు, ఎంపీడీఓ సీహెచ్.సుభాషిణి, ఎంపీఓ కృష్ణయ్యతో పాటు వెంకటేశ్వరరావు, సుబ్బారావు, బాబురావు పాల్గొన్నారు.

కన్ను పడితే ఖతమే !

- బయటపడుతున్న 'గంగారం' అక్రమార్కుడి లీలలు
- ఐపీ పేరుతో బెదిరింపులు.. సెటిల్‌మెంట్ పేరిట కబ్జాలు
- రెవెన్యూశాఖ లోపాయికారి సహకారంతో దందా
- ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలంటున్న బాధితులు



వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ సుభాషిణి

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం గంగారంలో ఎలాంటి డాక్యుమెంట్లు లేకున్నా... పెద్దమనిషి తరహాలో పంచాయితీ నిర్వహించి భూమి కబ్జా చేయడమే కాక వెంచర్ ఏర్పాటుకు సిద్ధమైన అక్రమార్కుడి లీలలు ఒక్కటొక్కటిగా బయటపడుతున్నాయి. సెటిల్‌మెంట్ పేరుతో పిలిపించడం.. ఆపై భూమి తన పేరిట రాయించుకోవడం లేదంటే కబ్జా చేయడం ఆనవాయితీగా మార్చుకున్న సదరు వ్యక్తి ఘనకార్యాలను బాధితులు వెల్లడిస్తున్నారు. అప్పు ఇప్పించడం, పంచాయితీ చేసి న్యాయం జరిగేలా చూడడం మాటేమో కానీ కనిపించిన భూమినల్లా కబ్జా చేసేందుకు వెనుకాడని సదరు వ్యక్తి తీరుపై ఏ అధికారి, ప్రజాప్రతినిధి నోరెత్తకపోవడం మరింత ఆందోళనకు గురి చేస్తుందంటూ వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి పెద్దమనిషి పేరిట పంచాయితీలతో కబ్జాలకు పాల్పడుతున్నట్లు ఆక్రమార్కుడి ఆగడాలపై విచారణ జరిపించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

ఐపీ పేరుతో ఆందోళన
రెండున్నరేళ్ల క్రితం సత్తుపల్లిలో ఓ వ్యాపారి రూ.20 కోట్లకు ఐపీ పెడుతున్నాడనే ప్రచారం సంచలనం సృష్టించింది. దీంతో ఆయనకు అప్పు ఇచ్చిన వారు ఆందోళనకు గురయ్యారు. సమయమంతుల ముత్యాలరావు, కుమారుడు వెంకటరామారావు సుమారు రూ.24 కోట్లవ రకు అప్పులు ఉన్నట్లు అప్పట్లో ప్రచారం సాగింది. దీంతో అప్పు ఇచ్చిన వారంతా ఒక్కటై వీరిద్దరిని పోలీసులకు అప్పగించారు. అయితే, బాధితుల జాబితా చాంతాడంత ఉండటంతో సమస్య ఓ కొలిక్కి రాలేదు.

సెటిల్‌మెంట్ కింగ్ రంగప్రవేశం
అప్పుల విషయమై రోజుల తరబడి పోలీస్‌స్టేషన్‌లోనే కాక ప్రైవేట్ పంచాయితీలు జరిగాయి. ఆ సమయాన రంగప్రవేశం చేసిన సెటిల్‌మెంట్ కింగ్... వ్యాపారి ఐపీ పెడితే ఎవరికి డబ్బులు రావని, రూ.కోట్లలో ఉన్న ఆస్తి రాయించుకుంటే అందరూ తీసుకోవచ్చని నమ్మబలికాడు. ఈమేరకు పంచాయితీ తానే చేస్తానని చెబుతూ ముత్యాలరావు కుటుంబానికి చెందిన సత్తుపల్లిలోని రూ.కోట్ల విలువైన భవంతి, గంగారం సెంటర్‌లో ప్లాట్లు, మేడిశెట్టివారిపాలెం క్రాస్‌రోడ్డులో భూమి కొందరికి రిజిస్ట్రేషన్ చేయగా, మరికొందరికి ఇవ్వాల్సి ఉంది. అంతా సాఫీగా జరుగుతుందని భావిస్తున్న నేపథ్యాన సెటిల్‌మెంట్ కింగ్ మళ్లీ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిని బెదిరించి స్థలాలు స్వాధీనం చేసుకున్నాడని చెబుతున్నారు. ఈ విషయంలో ముత్యాలరావు కుటుంబ సభ్యుల ప్రమేయం కూడా ఉందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని వాపోతున్నారు. ఈక్రమంలో భూములన్నింటినీ ప్రహరీలు నిర్మించినా పట్టించుకునే అధికారులే లేరని చెబుతున్నారు. ఇచ్చిన అప్పులో ఎంతో కొంత వచ్చిందని భావిస్తుండగా మొత్తానికి ఎసరు వచ్చేలా ఉందని ఆందోళన చెందుతున్నారు. గంగారం సెంటర్‌లోని భూమిలో కాంప్లెక్స్, అపార్ట్‌మెంట్ కడుతున్నా పట్టించుకోని అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది.

ఎంజాయ్‌మెంట్ సర్వే చేసినా..
జిల్లాలోనే అతిపెద్ద రెవెన్యూ బేతుపల్లి 12,797 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో సర్వే నెంబర్ 133లో 3,089 ఎకరాలు ఉండగా..తరచూ భూవివాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యాన మూడేళ్ల క్రితం బేతుపల్లి రెవెన్యూను ఎంజాయ్‌మెంట్ సర్వే చేయాలని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరగా అప్పటి కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ సానుకూలంగా స్పందించారు. ఈమేరకు సర్వేలో రైతుల భూమి పోగా, పొజిషన్‌లో ఉన్నవారికి పట్టాలివ్వాలని నిర్ణయించారు. ప్రస్తుత కలెక్టర్ గౌతమ్ చేతుల మీదుగా రైతులకు పాస్‌పుస్తకాలు కూడా ఇచ్చారు. దీనిని అక్రమార్కులు తమకు అనువుగా మార్చుకుని మిగులు భూములకు హద్దులు అవసరం లేదనే సాకుతో సత్తుపల్లి మండలం పాకలగూడెం, చింతంపల్లి శివారు, సత్యనారాయణపురం గ్రామాల్లో సర్వేనంబర్లతో రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు సమాచారం.

మళ్లీ ఫ్లెక్సీ ఏర్పాటు

'పెద్దరికం పేరిట కబ్జా' శీర్షికన గంగారంలోని భూమి విషయమై శుక్రవారం 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఈమేరకు సత్తుపల్లి ఎంపీడీఓ సీహెచ్.సుభాషిణి వివాదాస్పద భూమిని పరిశీలించారు. గతంలో లే ఔట్‌కు అనుమతి లేదని ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని తీసేసిన నేపథ్యాన మళ్లీ అక్కడ ఫ్లెక్సీ ఏర్పాటుచేయించారు. ఇప్పటికే ఐదు సార్లు ఫ్లెక్సీ ఏర్పాటు చేశామని ఎంపీడీఓ చెప్పడం గమనార్హం.

సాక్షి ఎఫెక్ట్..

నాలా కన్వర్షన్ పరిశీలిస్తాం..

ధరణి పోర్టల్ కారణంగా భూములు పరిశీలన చేసే అవకాశం మాకు లేదు. గతంలో మ్యాన్యువల్ పహాణీ ఉండడంతో పర్యవేక్షించే వాళ్లం. ఇక భూమి విస్తీర్ణం పెద్దది కావడంతో తరచుగా నాలా కన్వర్షన్లు జరుగుతుంటాయి. ప్రస్తుతం వివాదం నెలకొన్న భూమికి నాలా కన్వర్షన్ అయిందో, లేదో పరిశీలిస్తాం.
– టి.శ్రీనివాసరావు, తహసీల్దార్, సత్తుపల్లి

నా డబ్బు ఎగ్గొట్టారు..



ముత్యాలరావు కుమారుడు వెంకటరామారావుకు రూ.52 లక్షల నా సొంత డబ్బుతో పాటు బంధువుల నుంచి ఇప్పించాను. అప్పులు పెరిగిపోయి ఐపీ పెడతారని భయపెట్టే సరికి ఎంతో కొంత తగ్గించి ఇవ్వాలని కోరాం. ఈ సమయాన పెద్దమనిషి మా నుంచి ప్రామిసరీ నోట్లు తీసుకుని డబ్బులు ఎగొట్టారు.
– కోలగట్ల చెన్నారావు, గంగారం, సత్తుపల్లి

దందా చేసి బెదిరిస్తున్నారు..



పెద్దమనిషి పంచాయితీ పేరిట పిలిచి నా వద్ద ఉన్న నోట్లు లాక్కుని బెదిరించాడు. భూమి ఇస్తానని చెప్పి ఆతర్వాత కేసు పెట్టావంటూ ఆయన మనుషులతో బయటకు గెంటించాడు. అప్పు కింద మాకు ఇస్తానన్న స్థలాల్లో ఇప్పుడు భవనాలు నిర్మిస్తున్నారు. ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియని పరిస్థితి ఎదుర్కొంటున్నాం.
– లేళ్ల నాగిరెడ్డి, గంగారం, సత్తుపల్లి

క్లుప్తంగా

రేపు జాతీయస్థాయి కరాటే టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలో ఆదివారం జాతీయ స్థాయి ఆల్ స్టైల్స్ కరాటే, కుంగ్‌ఫూ టోర్నీ ఏర్పాటుచేసినట్లు చీఫ్ ఆర్గనైజర్ గోపతి సైదులు తెలిపారు. జూనియర్స్, సీనియర్స్, పురుషులు, మహిళల విభాగాల్లో వివిధ అంశాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు మొదలయ్యే పోటీలకు క్రీడాకారులు హాజరుకావాలని సూచించారు.

తాగునీటి కోసం రహదారిపై ధర్నా



ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న కాలనీవాసులు

ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరి ఇందిరమ్మ కాలనీలో తాగునీటి ఇక్కట్లు తీర్చాలనే డిమాండ్‌తో కాలనీవాసులు శుక్రవారం ధర్నాకు దిగారు. వెంకటగిరి క్రాస్ రోడ్డులో ఖమ్మం – కోదాడ రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. తాగునీటి ట్యాంక్ వద్ద సంప్ నిర్మించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆరోపించారు. ఇకనైనా సంప్ నిర్మించి తమ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా, ధర్నాతో గంటసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోగా, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

చింతకాని: మండలంలోని తిమ్మినేనిపాలెంకు చెందిన వివాహిత నాదెండ్ల త్రివేణి(36) ఇటీవల పురుగుల మందు తాగగా ఆస్పత్రి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రివేణిని ఆమె భర్త నాదెండ్ల భాస్కర్, అత్తమామలు కొంతకాలంగా శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. అంతేకాక చనిపోవాలని దూషిస్తుండటంతో మనస్తాపం చెందిన ఆమె ఈనెల 23న పురుగుల మందు తాగగా బంధువులు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, త్రివేణికి ఆమెకు ఇద్దరు పిల్లలు ఉండగా, ఆమె తల్లి సుశీల ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పొదిల వెంకన్న తెలిపారు.

వెలుగుమట్లలో వివాహిత..

ఖమ్మంఅర్బన్: నగరంలోని వెలుగుమట్లకు చెందిన వివాహిత గుంజా రమణ(28) పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఖమ్మం అర్బన్ పోలీసుల కథనం ప్రకారం.. వెలుగుమట్లకు చెందిన సైదులుతో రమణకు 12 ఏళ్ల క్రితం వివాహం జరగగా, కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులతో ఆమె మనస్తాపానికి గురై ఈనెల 22న పురుగుల మందు తాగింది. ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందడంతో ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెంపులకు చెందిన చెన్నబోయిన వీరబాబు(30) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... వీరబాబుకు కొంతకాలం క్రితం ఏదులాపురంకు చెందిన సౌజన్యతో వివాహం జరగగా, అనంతరం మనస్పర్థలతో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ఆవేదన చెందుతున్న వీరబాబు ఈనెల 26న ఇంట్లో ఎవరూ లేనప్పుడు పురుగుల మందు తాగగా కాసేపటికి గమనించిన కుటుంబీకులు ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

గుప్తనిధులు లభించాయని ప్రచారం

వైరా/కొణిజర్ల: వైరా మున్సిపాలిటీ పరిధి కొణిజర్ల మండలం శాంతినగర్ బీసీ కాలనీలో చేపట్టిన మట్టి తవ్వకాల్లో భారీగా బంగారం లభించిందంటూ శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగింది. బీసీ కాలనీలో వైరా రిజర్వాయర్ సమీపాన ఓ గుట్ట ప్రైవేట్ వ్యక్తి చేతిలో ఉంది. అక్కడ శుక్రవారం జేసీబీ సాయంతో మట్టి తవ్వకాలు చేపట్టగా భారీగా బంగారంతో కూడిన పెట్టె లభించిందని ప్రచారం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న కొణిజర్ల పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ చేపట్టగా అలాంటిదేమీ లేదని తేలింది. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లు నమ్మవద్దని ఎస్సై టి.యయాతి రాజు సూచించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,205	6,600
కందులు	6,600	6,100
మిర్చి కొత్తవి	19,100	12,000
మిర్చి తాలు	9,600	7,500
పత్తి	7,700	5,800

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు



టన్ను ధర రూ.13,881

అన్నదాత.. అరిగోస!

విద్యుత్ కోతలతో అవస్థలు
- 12 గంటల పాటు త్రీ ఫేస్ కరెంట్ రాక ఇక్కట్లు
- ఎల్ఆర్, ఎల్‌సీ పేరుతో గంటల కొద్దీ కోతలు



వేంసూరు మండలంలో ఇటీవల వేసిన వరి నాట్లు

వేంసూరు: పుడమి తల్లిని నమ్ముకుని పంటలు సాగు చేస్తున్న రైతన్న అప్రకటిత కరెంట్ కోతలతో నానా అవస్థ పడుతున్నారు. ప్రభుత్వం 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నా చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ఇక 12 గంటల పాటే సరఫరా వస్తుండగా, అదీ త్రీఫేజ్ విద్యుత్ సక్రమంగా అందించకపోవడంతో పంటల సాగుకు నీరు అందించలేని పరిస్థితి ఎదురవుతోందని రైతులు వాపోతున్నారు. జిల్లాలోని పలు చోట్ల వారం, పది రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఈమేరకు కొన్నిచోట్ల రైతులు ఆందోళనకు దిగుతున్నా ఫలితం ఉండడం లేదు.

ముమ్మరంగా వ్యవసాయం పనులు

జిల్లాలో యాసంగి వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు పొలాల్లో దమ్ము చేయడం, నాట్లు వేసే పనుల్లో బిజీగా ఉన్నారు. చెరువులు, జలాశయాలే కాకుండా భూగర్భ జలాలు మెరుగైన స్థితిలో ఉండడంతో విద్యుత్ బోర్ల ఆధారంగా ఎక్కువగా పంటలు సాగవుతున్నాయి. కొందరు మంది మిర్చి సాగు చేస్తుండగా మరికొందరు వరి, మొక్కజొన్న పంటలు కోసి యాసంగిలో మొక్కజొన్న, కూరగాయల సాగు ప్రారంభించారు. ఈక్రమంలో మిర్చి రెండో దశ కాత కాస్తుండగా, మొక్కజొన్న, కూరగాయల పంటలు మొలక దశలో ఉన్నాయి. ఈ సమయంలో నీటి తడులు అధికంగా అవసరమవుతాయి. కానీ విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో రైతుల అవస్థ పడుతున్నారు. విద్యుత్ వినియోగం పెరగడంతో ట్రాన్స్‌కో అధికారులు దశలవారీగా విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

ఎప్పుడు ఇస్తారో ఏమో?

జిల్లాలోని పలు మండలాల్లో విద్యుత్ వినియోగం పెరిగిన నేపథ్యాన కోత విధిస్తున్నట్లు అనధికారికంగా చెబుతున్నారు. కానీ ఇచ్చే 12గంటల విద్యుత్ త్రీ ఫేస్ రాకపోవడంతో బోర్లు నడవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అంతేకాకుండా సరఫరా కూడా రాత్రి వేళ ఇస్తుండడంతో కాపలా ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. అలాగే, సరఫరా సమయంలోనూ తరచుగా బ్రేక్ డౌన్ అవుతుండడంతో పొలానికి నీరు పారడం లేదని సమాచారం. పంటలు చేతికందే దశలో ఉన్న నేపథ్యాన అధికారులు స్పందించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

ఇష్టారాజ్యంగా కోతలు

ఉదయం 6నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉండాల్సిన త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా జరుగుతుందని చెబుతున్నా, స్థానిక సిబ్బంది ఎల్‌సీ(లోకల్ కటింగ్), ఎల్ఆర్(లైన్ రీపేర్) పేరుతో గంటల కొద్దీ కోత విధిస్తున్నారు. ఒక్కోసారి త్రీ ఫేస్ విద్యుత్ ఏ సమయంలో ఉంటుందో తెలియడం లేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే తెగుళ్ల కారణంగా పంటలు నష్టపోయిన తాము మరోమారు పంట నష్టపోకుండా అధికారులు స్పందించాలని రైతులు విన్నవిస్తున్నారు.



కోత దశలో ఉన్న మొక్కజొన్న చేను

పంట తడి తిరగడంలేదు



ఐదు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నా. ఇప్పటివరకు విత్తనాలు, కూలీలు, ఎరువులకు దాదాపుగా రూ.15 వేలు ఖర్చు చేశాను. ఈ సమయాన ఇష్టారాజ్యంగా విద్యుత్‌కోతతో బోర్ల సాయంతో సాగు చేస్తున్న పంట తడి తిరగడం లేదు. విద్యుత్ కోత ఇలానే ఉంటే పంట నష్టపోక తప్పదు.
– కనమల మురళి, రైతు, మర్లపాడు

నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలి



విద్యుత్ కోతలతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అప్పులు తెచ్చి సాగు చేస్తున్న పంటలకు సాగు నీరు అందించలేని పరిస్థితి ఏర్పడుతోంది. సాగు చేస్తున్న భూమిలో సగం కూడా తడవడం లేదు. దీనికి తోడు అర్ధరాత్రి కరెంట్ ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలి.– మందపాటి రాఘవరెడ్డి, రైతు, మర్లపాడు

నేటి నుంచి 'సాక్షి' ప్రీమియర్ లీగ్

ఖమ్మంస్పోర్ట్స్: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యాన సుధాకర్ పీవీసీ పైప్స్ సౌజన్యంతో నిర్వహిస్తున్న 'సాక్షి' ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ శనివారం ప్రారంభం కానుంది. ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో పోటీలను జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి ప్రారంభిస్తారు. ఈ పోటీల్లో జూనియర్స్ విభాగం నుంచి 23 జట్లు, సీనియర్ విభాగంలో (డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలు) 26 జట్లు పాల్గొననున్నాయి. తొలుత జూనియర్స్ విభాగంలో జట్లకు నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

తొలిరోజు మ్యాచ్‌లు..

పోటీల తొలిరోజైన శనివారం జరిగే మ్యాచ్‌ల వివరాలిలా ఉన్నాయి. కృష్ణవేణి జూనియర్ కళాశాల – 2 (ఖమ్మం) – ఎక్సలెంట్ జూనియర్ కళాశాల (ఖమ్మం), వెలాసిటీ జూనియర్ కళాశాల (ఖమ్మం) – దరిపెల్లి డిప్లొమా కాలేజీ(ఖమ్మం), కృష్ణవేణి జూనియర్ కళాశాల – 1 (ఖమ్మం) – గౌతమబుద్ధ ఐటీఐ(ఇల్లెందు) జట్ల నడుమ మ్యాచ్‌లు జరుగుతాయి. అలాగే, ఎస్.ఆర్. జూనియర్ కళాశాల (ఖమ్మం) – సాహితీ జూనియర్ కళాశాల (ఖమ్మం), ఏఎస్ఆర్ జూనియర్ కళాశాల (ఖమ్మం) – రెజొనెన్స్ జూనియర్ కళాశాల(ఆర్‌పీఎల్ – ఖమ్మం), ఎస్‌బీఐటీ డిప్లొమా కాలేజీ (ఖమ్మం) – రెజొనెన్స్ జూనియర్ కాలేజీ (హాస్టల్ – ఖమ్మం), అనుబోస్ డిప్లొమా కాలేజీ (పాల్వంచ) – నయాబజార్ జూనియర్ కాలేజీ (ఖమ్మం), కిట్స్ డిప్లొమా కళాశాల (ఖమ్మం) – అబ్దుల్ కలాం డిప్లొమా కళాశాల (పాల్వంచ) జట్ల నడుమ మ్యాచ్‌లు జరగనున్నాయి.

ఏసీడీ చార్జీలు ఉపసంహరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజలపై అదనపు భారం మోపేలా ఉన్న విద్యుత్ అడిషనల్ కంజప్షన్ డిపాజిట్(ఏసీడీ) చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏసీడీ పేరుతో ప్రజలపై ప్రభుత్వం భారం మోపడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. బిల్లులు కట్టని మొండి బకాయిదారుల ఆస్తులు జప్తు చేసుకోవాలే తప్ప క్రమం తప్పకుండా బిల్లులు కడుతున్న వారిపై అదనపు భారం మోపడం సరికాదని పేర్కొన్నారు. ఈ విషయమై శనివారం ఎస్ఈ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు ఎర్రా శ్రీకాంత్, వై.విక్రమ్, టి.లింగయ్య, ఎర్రా శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమిపై లావాదేవీలకు పాల్పడితే చర్యలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం వెలుగుమట్ల రెవెన్యూ పరిధిలో టేకులపల్లి శ్రీ భక్తంజనేయ స్వామికి దాతలు ఇచ్చిన భూమికి సంబంధించి ఎవరైనా లావాదేవీలు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఏ.సులోచన తెలిపారు. నగరంలోని శ్రీశ్రీ సర్కిల్ ప్రాంతంలో 504 సర్వే నంబర్‌లోని 3–10 ఎకరాల భూమిని బొందిలి కన్నయ్య, లాల్‌సింగ్, బొందిలి కృష్ణాబాయ్‌లు 1996లో ఆలయానికి ధూప దీప నివేదన కోసం రిజిస్ట్రేషన్ చేశారని పేర్కొన్నారు. కాగా, భూమిపై హైకోర్టు, దేవాదాయ శాఖ ట్రిబ్యునల్‌లో కేసులు కొనసాగుతున్నందున ఎలాంటి లావాదేవీలు చెల్లవని తెలిపారు.

న్యాయం చేయాలని హోంమంత్రి, డీజీపీకి వినతి

రఘునాథపాలెం: మండలంలోని మంగ్యాతండాకు చెందిన వివాహిత భూక్యా లక్ష్మి గత నెల 8న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా, కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని ఆమె అల్లుడు ధరావత్ మల్సూర్ కోరారు. ఈ విషయమై రాష్ట్ర హోంమంత్రి, డీజీపీతో పాటు ఖమ్మం సీపీకి వినతిపత్రాలు అందజేసినట్లు ఆయన శుక్రవారం తెలిపారు. గ్రామంలో జరిగిన చిన్నపాటి ఘర్షణను దృష్టిలో పెట్టుకుని స్థానిక పెద్దలు ఒంటరిగా నివసిస్తున్న లక్ష్మిని పంచాయితీకి పిలిపించి రూ.3వేల జరిమానా విధించారని పేర్కొన్నారు. దీంతో ఆమె మనస్తాపంతో ఆత్మహత్య చేసుకోగా, రఘునాథపాలెం పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. అలాగే, లక్ష్మి మరణానికి ముందు మరణ వాంగ్మూలం కూడా ఇచ్చినందున, బాధ్యులపై హత్య కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ముగిసిన రామదాసు జయంతి ఉత్సవాలు

- 'హాజరైన కలెక్టర్ గౌతమ్ దంపతులు
- 'నృత్యంతో అలరించిన కలెక్టర్ సతీమణి



నృత్య ప్రదర్శన ఇస్తున్న కలెక్టర్ సతీమణి గౌతమి

నేలకొండపల్లి: భక్తాగ్రేసరుడు కంచర్ల గోపన్న (భక్తరామదాసు) జయంత్సోవాలు ఆయన స్వస్థలమైన నేలకొండపల్లిలో శుక్రవారం ముగిశాయి. రామదాసు ధ్యాన మందిరంలో భాషా సాంస్కృతిక శాఖ, జిల్లా పాలనా యంత్రాంగం, శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం, విద్వత్ కళాపీఠం ఆధ్వర్యాన మూడు రోజుల నుంచి జయంతోత్సవాలు నిర్వహించగా, వివిధ ప్రాంతాల కళాకారుల ప్రదర్శనలు ఆలరించాయి. చివరి రోజు హైదరాబాద్‌కు వ్యాపారి నేంద్రగంటి కృష్ణమోహన్, అనాసాగారానికి చెందిన కవి చిలకబత్తిని వీరబాబు, సంగీత కళాకారిణి కౌటురి గాయత్రి తదితరుల ప్రదర్శనలు ఏర్పాటుచేశారు.



కవి చిలకబత్తిని వీరబాబును సన్మానిస్తున్న నిర్వాహకులు

ముగింపు ఉత్సవాల్లో కలెక్టర్

రామదాసు జయంతి ఉత్సవాల ముగింపు వేడుకలకు శుక్రవారం రాత్రి కలెక్టర్ వీ.పీ.గౌతమ్ కుటుంబంతో సహా హాజరయ్యారు. ఈమేరకు మందిరంతో పాటు రామదాసు కాంస్య విగ్రహం వద్ద పూజలు చేశారు. అనంతరం కలెక్టర్ సతీమణి గౌతమి ప్రదర్శించిన భరతనాట్యం అలరించాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌రావు, తహసీల్దార్ దారా ప్రసాద్, సర్పంచ్ రాయపూడి నవీన్, విద్వత్ కళాపీఠం ప్రతినిధులు రాధాకృష్ణమూర్తి, పెండ్యాల గోపాలకృష్ణమూర్తి, నంచర్ల దేవీప్రసాద్, ఓరుగంటి నారాయణరావు, పూజారి సౌమిత్రి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రీజినల్ సెంటర్ తనిఖీ

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజినల్ సెంటర్‌ను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ పి.వెంకటరమణ శుక్రవారం తనిఖీ చేశారు. న్యాక్ గుర్తింపు కోసం వెళ్లనున్న తరుణాల ఆయన అధ్యాపకులు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం వెంకటరమణను అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.రమేష్ సన్మానించారు. ఈకార్యక్రమంలో జార్జి రాజ్‌కుమార్, వాణి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ఆర్‌టీఐ కమిషనర్

ఖమ్మం సహకారనగర్: సమాచార శాఖ రాష్ట్ర కమిషనర్ గుగులోతు శంకర్‌నాయక్ శని, ఆదివారాల్లో జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం రాత్రే ఆయనకు జిల్లాకు చేరుకోగా, శనివారం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో భేటీ అవుతారు. అలాగే, ఆదివారం నగరంలో జరిగే పలు కార్యక్రమాలకు ఆయన హాజరుకానున్నారు.

నలుగురు ఉపాధ్యాయుల బదిలీ

ఖమ్మం సహకారనగర్: నలుగురు ఉపాధ్యాయులకు బదిలీ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నేలకొండపల్లి మండలం బైరవునిపల్లి జెడ్పీఎస్ఎస్ ఉపాధ్యాయులు జి.జయశ్రీని ఖమ్మం అర్బన్ మండలం కొత్తగూడెం జెడ్పీఎస్ఎస్‌కు, బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్)నుంచి ఎస్.లక్ష్మీరాజ్యంను ఖమ్మం అర్బన్ మండలం బల్లేపల్లి జెడ్పీఎస్ఎస్‌కు, రఘునాథపాలెం నుంచి కె.సునీతను ఖమ్మం అర్బన్ మండలం బాలాజీనగర్ ఎంపీపీఎస్‌కు, భద్రాద్రి జిల్లా టేకులపల్లి నుంచి వాసిరెడ్డి పారిజాతంను ఖమ్మం అర్బన్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారు. వీరు తక్షణమే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విలేకరుల పేరిట ఇసుక ట్రాక్టర్లు అడ్డగింత

నేలకొండపల్లి: ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను విలేకరుల పేరిట ఇద్దరు అడ్డుకుని వీరంగం సృష్టించారు. ఏపీలోని మల్కాపురం నుంచి నేలకొండపల్లి మండలానికి శుక్రవారం రెండు ఇసుక ట్రాక్టర్లు వస్తుండగా, ఇద్దరు నాచేపల్లి వద్ద అడ్డుకుని తాము విలేకరులమని బెదిరించారు. డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో ట్రాక్టర్ల డ్రైవర్లు రూ.వెయ్యి ఇచ్చినా గంట పాటు అడ్డుకోవడంతో వివాదం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. చివరకు పోలీసులు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం చేసుకున్నారు. కాగా, ట్రాక్టర్ యాజమానులు తమ వాహనాలు ఆపి డబ్బులు డిమాండ్ చేసిన నకిలీ విలేకరులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

ఖమ్మం అర్బన్: నగరంలోని వైఎస్సార్ నగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ రామకృష్ణపై ఈనెల 24న దాడి చేసి గాయపర్చడమే కాక ఆటోను ధ్వంసం చేసిన ఘటనలో ఇద్దరిపై శుక్రవారం కేసు నమోదైంది. కొద్దిరోజుల క్రితం ఒక యూట్యూబ్ చానల్ చేపట్టిన సర్వేలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఏ పార్టీ నుండి అయినా గెలుస్తాడని వైఎస్సార్ నగర్‌కు చెందిన రామకృష్ణ వెల్లడించాడు. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు గోపాలపురం వద్ద ఆయనపై దాడి చేయడమే కాక ఆటోను ధ్వంసం చేశారు. ఈమేరకు మందడపు మనోజ్, బి.విజయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ సీఐ రామకృష్ణ తెలిపారు.

భార్య ఉండగానే రెండో వివాహం

ఖమ్మంరూరల్: భార్య, పిల్లలు ఉండగానే మరో యువతిని నమ్మించి వివాహం చేసుకోవడమే కాక అబార్షన్ చేయించుకోవాలని ఆమెపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. మండలంలోని పొన్నేకల్‌కు చెందిన యాద భరత్ గూడురుపాడుకు చెందిన కొత్తకొండ శ్రావణిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే అప్పటికే ఆయనకు మరో మహిళతో వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్న విషయాన్ని దాచిపెట్టాడు. ఈక్రమంలో శ్రావణిని పెళ్లి చేసుకుని ఆదిత్యనగర్‌లో కాపురం పెట్టగా ఆమె గర్భం దాల్చడంతో అబార్షన్ చేయించుకోవాలని ఒత్తిడి చేశాడు. ఈనెల 21న అశోక్, కృష్ణతో కలిసి ఆమెపై దాడి చేయగా శ్రావణి ఫిర్యాదుతో భరత్ సహా ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

అందరికీ అండగా నిలుస్తా..

మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి




అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

మధిర/కల్లూరు: కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలుస్తానని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మధిరలో శుక్రవారం జరిగిన పలు శుభకార్యాలకు ఆయన హాజరయ్యారు. అలాగే, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఇక కల్లూరులో కూడా పర్యటించిన పొంగులేటి అనారోగ్యం బాధపడుతున్న వారికి చికిత్స కోసం ఆర్థిక సాయం అందజేశారు. ఈకార్యక్రమాల్లో డీసీసీబీ డైరెక్టర్ ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ శీలం కవిత, డాక్టర్ కోట రాంబాబు, నాయకులు తుళ్లూరు బ్రహ్మయ్య, యన్నం కోటేశ్వరరావు, దేవిశెట్టి రంగారావు, అక్కినపల్లి నాగేశ్వరరావు, చిలకా సత్యం, కాటేపల్లి కిరణ్‌కుమార్, ఉబ్బన శ్రీను, ఎస్.ఏ.మైబు, ఆళ్లకుంట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

30న 'మధిర' ఆత్మీయ సమ్మేళనం

మధిర: కొద్దిరోజుల నుంచి నియోజకవర్గాల వారీగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 30వ తేదీన మధిర నియోజకవర్గ స్థాయి సమ్మేళనం ఏర్పాటుచేశారు. బోనకల్‌లోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ సమ్మేళనం ఉదయం 11 గంటలకు మొదలవుతుందని పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. మధిర నియోజకవర్గంలోని అభిమానులు భారీసంఖ్యలో తరలిరావాలని కోరారు.

పొంగులేటి టీమ్‌లోకి విజయాబాయి



విజయాబాయి

వైరా: గత అసెంబ్లీ ఎన్నికల్లో వైరా నుంచి సీపీఐ అభ్యర్థిగా పోటీ చేసిన బానోత్ విజయాబాయి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి టీమ్‌లో చేరారు. ఇటీవల శ్రీనివాసరెడ్డి పార్టీ మార్పుపై జోరుగా ఊహాగానాలు సాగుతున్న నేపథ్యాన ఆయన నియోజకవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలోనే రెండు రోజుల క్రితం ఖమ్మంలో వైరా నియోజకవర్గ ముఖ్య నేతలతో సమావేశమై రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైరా నుంచి బానోత్ విజయాబాయి అభ్యర్థిత్వంపై చర్చించినట్లు సమాచారం. ఈమేరకు ముఖ్య నాయకులతో అభిప్రాయ సేకరణ చేసినట్లుగా చెబుతున్నారు. ఈక్రమంలో శ్రీనివాసరెడ్డి పార్టీ మారితే తన బృందంతో విజయను కూడా తీసుకెళ్లే యోచనకు వచ్చినట్లు సమాచారం.

సీపీఐకి రాజీనామా

సీపీఐ వైరా నియోజకవర్గ నాయకురాలు విజయాబాయి శుక్రవారం పార్టీకి రాజీనామా చేశారు. ఈమేరకు ఆమె శుక్రవా రం లేఖ విడుదల చేశారు. అయితే, గత ఎన్నికల్లో వైరా నుంచి సీపీఐ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన విజయాబాయికి పార్టీతో ఇప్పుడు ఎలాంటి సంబంధం లేదని పార్టీ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఇంకో ప్రకటనలో వెల్లడించారు.